క్లుప్తంగా

కార్యకర్తలతో సమావేశం



మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

పెంచికల్‌పేట్: మండలంలోని బొంబాయి గూడ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావి శ్రీనివాస్ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఖండించాలన్నారు. పార్టీ ఎన్నికల మెనిఫెస్టోను గడపగడపకు వివరించాలని సూచించారు. పోతెపల్లి సర్పంచ్ దాసరి చంద్రమౌళి, సోషల్‌మీడియా ఇన్‌చార్జి బోయిరే బండు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు సాధించాలి



మాట్లాడుతున్న అధికారి యాదగిరి

పెంచికల్‌పేట్: విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి యాదగిరి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్‌లో అనుకున్న లక్ష్యాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్‌పీలు శ్రీలత, గణేశ్, భరత్, కృష్ణకుమార్, రాధాకృష్ణ, వినేశ్, ఉపాధఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ప్రకాశ్

కెరమెరి: మండలంలోని ఎంఆర్సీ కార్యాలయంలో మండలంలోని 85 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు రాగిజావ, మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలు గురువారం పంపిణీ చేశారు. ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ మాట్లాడుతూ మండలంలోని మొత్తం 4213 మంది విద్యార్థులు, 112 మంది ఎండీఎం కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సద్గురు శ్రీ మధుసూదన సాయి జన్మదినం సందర్భంగా ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు ప్రవీణ్, విజేశ్, రజిత, అరుణ్, శ్రీధర్, సీసీవో మహేందర్ ఉన్నారు.

వాంకిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేసిన చీరలను గురువారం విద్యావనరుల కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎంపీపీ ముండె విమలబాయి హాజరై కార్మికులకు చీరలు, విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఎంఈవో మనుకుమార్, సీఆర్పీలు సందీప్, విజయ్‌బాబు, బీఆర్ఎస్ నాయకుడు దీపక్ ముండె తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు



గుంతలు పూడుస్తున్న రిజ్వాన్

కెరమెరి: మండలంలోని కెరమెరి నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లే రోడ్డుకు బీఆర్ఎస్ నాయకుడు, ధనోరా ఉపసర్పంచ్ రిజ్వాన్ సొంత ఖర్చుతో గురువారం మరమ్మతులు చేయించారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వర్షం నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా శ్రీపాల్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

కాగజ్‌నగర్‌టౌన్: మండల నూతన తహసీల్దార్‌గా కె.శ్రీపాల్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన మునావర్ షరీఫ్‌ను ప్రభుత్వం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అటాచ్ చేసింది. కాగా బెజ్జూర్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన శ్రీపాల్ రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సమస్యలతో సహవాసం

- బురదరోడ్లతో తిప్పలు
- నిర్వహణ లేని డ్రెయినేజీలు
- వీధి దీపాలు కరువు
- ఇబ్బందుల్లో జీడిచేను గ్రామస్తులు



పేరుకుపోయిన మురికినీరు



నీళ్ల కోసం బోరింగ్ వద్ద క్యూ కట్టిన మహిళలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి జీడిచేను గ్రామస్తులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 150 కుటుంబాలు నివాసం ఉంటుండగా గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పల్లెలో దుర్గంధం వెదజల్లుతోంది. ఆయా కాలనీల్లో సీసీరోడ్లు లేకపోవడంతో చిన్న వర్షం కురిసినా బురదమయంగా మారుతున్నాయి. వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రిళ్లు గ్రామస్తులు బయటకు వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు.

బురదమయంగా రోడ్లు..

గ్రామంలోని అనేక కాలనీల్లో సీసీరోడ్లు లేకపోవడంతో వర్షం పడితే మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి.దీంతో రోడ్లపై కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితులు ఉంటున్నాయి. కాలనీల్లో సీసీ రోడ్లు వేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లోపించిన పారిశుధ్యం..

గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణమే దర్శనమిస్తుంది. కొన్ని కాలనీల్లో మురికి కాలువలు ఉన్నప్పటికీ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురికి నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. పారిశుధ్యం లోపించడంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. మురికి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలపై శ్రద్ధ వహించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

తాగునీటికి క్యూ..

గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా చేయడం లేదు. దీంతో గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సుమారు ఐదు బోర్‌వెల్స్ ఉండగా కేవలం ఒక్క బోర్‌వెల్ నీరు మాత్రమే తాగేందుకు అనుకూలంగా ఉంది. దీంతో ఈ బోర్‌వెల్ వద్ద ఎల్లప్పుడూ రద్దీగా ఉంటుంది.

రోడ్డుపై నడవలేని పరిస్థితి



మా కాలనీకి సీసీ రోడ్డు లేదు. దీంతో వర్షాకాలంలో కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. మురికి కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే వర్షం నీరు పారుతుంది. వీధి దీపాలు కూడా వెలుగడం లేదు. అధికారులు స్పందించి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

– తెల్లిరి సందీప్, జీడిచేను

గంటల తరబడి ఎదురుచూపులు



మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. నీరు తాగేందుకు వీలు లేకుండా వాసన వస్తున్నాయి. దీంతో పాతబడి దగ్గర గల బోర్‌వెల్ పైనే ఆధారపడుతున్నాం. బిందెడు నీళ్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది.

– సల్పల రాజేశ్వరి, జీడిచేను

బృహత్ వనంపై పట్టింపేది..?

- 31వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- రెండేళ్ల నుంచి నాటింది 4వేల మొక్కలే..
- భూమి తనదేనంటూ ట్రాక్టర్‌తో దున్నిన రైతు
- ధ్వంసమైన 1200 మొక్కలు



ట్రాక్టర్‌తో బృహత్‌వనం దున్నడంతో ధ్వంసమైన మొక్కలు

తిర్యాణి: ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే పల్లె ప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టింది. మండలంలోని 29 పంచాయతీల పరిధిలోని 114 అనుబంధ గ్రామాల్లో వనాల నిర్మాణం చేపట్టింది. దీంతో పాటుగా రూ.45 లక్షల ఉపాధిహామీ నిధులతో 31 వేల మొక్కలు పెంచేందుకు దాదాపు పది ఎకరాల స్థలంలో మండలానికి ఒక బృహత్ (మెగా) వనం నిర్మించాలని రెండేళ్ల క్రితం నిర్ణయించింది. కానీ మండలంలో నిర్మించిన బృహత్ వనం క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేరుకే బృహత్ వనంగా మిగిలిపోయింది.

ట్రాక్టర్‌తో దున్నిన మహిళా రైతు..

దాదాపు 20 రకాల పండ్లు, ఔషధ మొక్కలతో బృహత్ పార్కు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మండలాల్లో అనువైన స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించింది. అధికారులు కేటాయించిన స్థలంలో రెండేళ్ల క్రితం తూతూ మంత్రంగా 4వేల మొక్కలు నాటారు. అనంతరం బృహత్‌వనానికి వెళ్లేందుకు మట్టిరోడ్డు వేశారు తప్పా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. కాగా కొద్ది రోజుల క్రితం బృహత్ వనానికి సంబంధించిన భూమి తనదే అంటూ మండలానికి చెందిన ఓ మహిళా రైతు బృహత్ వనాన్ని ట్రాక్టర్‌తో దున్నడంతో దాదాపు 1200 వరకు మొక్కలు ధ్వంసమయ్యాయి. వాటి విలువ రూ.16 వేల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అందని ద్రాక్షగా ఆహ్లాదం..

మెగా పార్కుకు ప్రహరీ లేకపోవడంతో పశువులకు నిలయంగా మారింది. బృహత్ వనం మండల కేంద్రం నుంచి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉల్లిపిట్ట గ్రామ శివారులో ఉంది. బృహత్ వనం నిర్మించిన స్థలం మొక్కల పెంపకానికి అనువుగా లేకపోవడం, మండలానికి ఓవైపు మూలకు ఉండటం, సమీపంలో గ్రామాలు లేకపోవడంతో ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగా మారింది.

ఫిర్యాదు చేశాం

ఉల్లిపిట్ట గ్రామంలోని బృహత్ వనం స్థలాన్ని ఓ రైతు అక్రమంగా దున్నడంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. రైతు దున్నడం వల్ల 1200 మొక్కలు చనిపోయాయి. వాటి విలువ రూ.16 వేల వరకు ఉంటుంది. సంబంధిత రైతు నుంచి డబ్బును రికవరీ చేస్తాం.

– సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ఉల్లిపిట్ట

‘గృహలక్ష్మి’ కోసం బారులు

దహెగాం: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసేందుకు గురువారం ఆఖరు రోజు కావడంతో సర్టిఫికెట్ల కోసం ప్రజలు కార్యాలయాల్లో బారులు తీరారు. మీసేవ, జిరాక్స్ సెంటర్లలో రద్దీ కనిపించింది. కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణ పత్రాలు కావాల్సి ఉండడంతో మీసేవలో సందడి నెలకొంది. సర్టిఫికెట్లు అందకపోవడంతో కొందరు దరఖాస్తు చేసుకోలేకపోయారు. దరఖాస్తు తేదీ పొడిగించాలని పలువురు కోరుతున్నారు.

కౌటాల: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గురువారం ప్రజలు మీ సేవ కేంద్రాలు, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి దరఖాస్తులు సమర్పించారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల సందర్భంగా మండల కేంద్రంలోని ఫొటో స్టూడియోలు, జిరాక్స్ షాపులు జనంతో రద్దీగా కనిపించాయి. మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఇప్పటి వరకు 3వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో కార్యాలయ అధికారులు తెలిపారు.



దహెగాం: సర్టిఫికెట్ల కోసం బారులు తీరిన ప్రజలు

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా గ్రామాల నుంచి మొత్తం 2,111 దరఖాస్తులు గృహలక్ష్మి పథకం కోసం వచ్చినట్లు ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు గురువారం ఆఖరిరోజు కావడంతో పెద్ద ఎత్తున ప్రజలు రాగా మండల కేంద్రంలోని జిరాక్స్ కేంద్రాల వద్ద రద్దీ కనిపించింది. జిరాక్స్ కేంద్రాల నిర్వాహకులు భారీగా ధరలు పెంచి, ఒక్కో దరఖాస్తు ఫారాన్ని రూ. 10లకు విక్రయించగా, ఫారం నింపడానికి రూ.50 వసూలు చేశారు.

అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

కౌటాల: ప్రతీ ఒక్కరు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని టీబీ ప్రోగ్రాం జిల్లా అధికారి సునీల్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలతో పాటు బోధకాలు వ్యాధి నివారణలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫైలేరియా నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులకు తప్పనిసరిగా మాత్రలు వేయాలని సూచించారు. రెండు సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలకు డి.ఇ.సి, అల్బెండజోల్, 3 ఫీట్ల కంటే తక్కువ, 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఐవర్ మెక్టిన్ వేయొద్దన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ పావని, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

‘చలో హైదరాబాద్’ విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: పాత పెన్షన్ విధానం కోసం ఈనెల 12న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి కోరారు. గురువారం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన సమస్య సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దింటి క్రాంతి, రాష్ట్ర ఐటీ సెల్ బాధ్యులు పుల్లూరి బాలు, కాగజ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు దొంగ్రీ గజానన్, జిల్లా సెక్రటరీ సంతోష్ దొంగ్రీ, మున్సిపల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రతీ ఇంటా జెండా ఎగురవేయాలి

కౌటాల: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం తపాలశాఖ ఆధ్వర్యంలో మండలంలోని బీపీఎం, ఏబీపీఎంలు జాతీయ జెండాలతో ర్యాలీ తీశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. తపాలా కార్యాలయంలో రూ.25లకు జాతీయ జెండా లభిస్తుందన్నారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్, కౌటాల పోలీస్‌స్టేషన్లలో జాతీయ జెండాలు అందించారు. బీపీఎం, ఏబీపీఎంలు కర్మి గజానాన్, దుర్గం గౌతమ్, మోహన్, మనీషా, మండల శంకర్ గౌడ్, పూజిత, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో పోస్టల్ సిబ్బంది గురువారం హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ ర్యాలీని ప్రారంభించారు. కాగా ర్యాలీ పట్టణంలోని పలు వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ కృష్ణతో పాటు బీపీఎంలు, పోస్ట్‌మెన్‌లు పాల్గొన్నారు.



కౌటాలలో ర్యాలీ తీస్తున్న బీపీఎం, ఏబీపీఎంలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంతో పాటు ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్, ఏడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్ 132కేవీ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీటీ రోడ్డు వేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

తిర్యాణి: మండలంలోని గుడిపేట గ్రామపంచాయతీ కోర్లోంకా గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని గురువారం ఆదివాసీ సేన ఆధ్వర్యంలో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు మడావి వెంకట్రావ్ మాట్లాడుతూ గిన్నెధరి నుంచి కోర్లోంక వరకు బీటీ రోడ్డు మంజూరైనా గుడిపేట వరకు మాత్రమే వేశారన్నారు. మంజూరైన రోడ్డును పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌ల దృష్టికి తీసుకెళ్లినా స్పందించక పోవడం సరికాదన్నారు. నాయకులు కొర్వెత మారూతి, సుద్దు, టులి, యాదవురావు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



దహెగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

దహెగాం: మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆదివాసీలు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి నల్లి దామోదర్ జెండా ఎగురవేశారు. పలువురు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఏజీఎస్ మండల అధ్యక్షుడు సిడాం శంకర్, జిల్లా కార్యదర్శి, నెర్పెల్లి అశోక్, సహాయ కార్యదర్శి బక్కన్న, నాయకులు సేగం కమల, దూల లక్ష్మి, సాంబయ్య, కిష్టయ్య, బాపు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీపీ డుబ్బుల నానయ్య
- ముగిసిన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ డుబ్బుల నానయ్య

చింతలమానెపల్లి: మండలం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. గురువారం మండలంలోని బాలాజీ అనుకోడ రైతువేదికలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారుల పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో మండలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్యశాఖ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీ అధికారులు గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో మండలంలో వంతెనలు, రహదారుల పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. ఏటీడీవో హుస్సేన్ నివేదికలను సభ్యులకు ఇవ్వకుండా నేరుగా వినిపించడంతో కోఆప్షన్ సభ్యుడు నాజిం ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ముందస్తుగా సభ్యులకు అందించాలని సభ్యులు పేర్కొన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ స్పందిస్తూ ఆయా శాఖల అధికారులు వివరాలను సభ్యులకు అందించాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద నిర్వహిస్తున్న పనులను ఏపీవో గోవర్ధన్ వివరించారు. సభ్యులు మాట్లాడుతూ వ్యవసాయ భూములకు, రహదారులకు ఉపయోగపడే విధంగా అధికారులు సర్వేలు నిర్వహించి ఉపాధి పనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పశువైద్యంపై సభ్యులు స్పందిస్తూ మండల కేంద్రంలో పశు వైద్యశాల నిర్మించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో సుధాకర్ రెడ్డి, ఏవో రామక్రిష్ణ, ఏఈవోలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోదకాలు నివారణకు చర్యలు

దహెగాం: బోదకాలు నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మండల వైద్యాధికారి స్పందన అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బోదకాల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 12 వరకు బూత్‌స్థాయిలో మాత్రలు అందిస్తామని, 13 నుంచి 20 వరకు ఇంటింటికి వెళ్లి మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కెరమెరి: బోదకాలు వ్యాధి నివారణ మాత్రలను గురువారం మండల వైద్యాధికారి వినోద్ కుమార్ పంపిణీ చేశారు. మండలంలో మొదటిరోజు 1200 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. 76 బూత్ కేంద్రాల్లో కార్యక్రమం కొనసాగిందన్నారు. ఫార్మసిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



బోదకాలు నివారణ మాత్రలు వేస్తున్న స్పందన

ఎంపీపీకి ఎమ్మెల్యే పరామర్శ

కౌటాల: హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్‌ని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కోనేరు రమాదేవి దంపతులు పరామర్శించారు. ఎంపీపీ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీకృష్ణ, ఎంపీపీ విశ్వనాథ్, నాయకులు ఆత్మరాం, అశోక్, రవీందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు సంఘటనల్లో పోగొట్టుకున్న మూడు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి సదరు వ్యక్తులకు గురువారం ఈజ్‌గాం ఎస్సై రమేశ్‌కుమార్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సుకన్య, రాజేశ్, రాజన్నలకు ఫోన్‌లు అప్పగించినట్లు తెలిపారు. మొబైల్స్ ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీంను అభినందించారు.

చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు

నార్నూర్: చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని ఆర్జుని కొలాంగూడ, రాముగూడ, జంగుగూడ గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో సీడీపీవో శారద, ఎంపీపీ అడ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేశ్, సర్పంచ్ కాను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కేంద్రమంత్రి శివశంకర్ జయంతి

పాతమంచిర్యాల: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ కేంద్ర మంత్రి పుంజాల శివశంకర్ వర్ధంతిని జిల్లా కేంద్రంలో తెలంగాణ బీసీ జాగృతి నాయకులు ఘనంగా నిర్వహించారు.